7

సాక్షి తిరుపతి

బుధవారం : 24 : సెప్టెంబర్ : 2025



విద్యుత్‌దీపాలంకరణలో తిరుమల శ్రీవారి ఆలయం (ఇన్‌సెట్) విష్వక్సేనుడి ఊరేగింపు



విష్వక్సేన వీక్షణ

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం నిర్వహించిన అంకురార్పణతో టీటీడీ శ్రీకారం చుట్టింది. బుధవారం నుంచి పూర్తిస్థాయి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందు వైఖానస ఆగమ శాస్త్ర నియమబద్ధంగా వేదపండితులు అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను శ్రీవారి సేనాధిపతి శ్రీ విష్వక్సేనుడు తిరువీధుల్లో ఊరేగుతూ వీక్షించారు. సేనాపతి శంఖం, చక్రం, గద, ఖడ్గం తదితర ఆయుధాలను ధరించి ఛత్ర, చామర, మంగళ వాయిద్యాలతో భేరినాదాల నడుమ తిరుమాడ వీధుల్లో బంగారు తిరుచ్చి వాహనంపై వైభవంగా ఊరేగారు. అంకురార్పణ క్రతువులో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌ఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా తిరుమల కొండ విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతోంది. ఉద్యానవనంలో టీటీడీ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శనశాల భక్తులను ఆకట్టుకుంటోంది. బుధవారం నుంచి ప్రారంభమయ్యే వాహన సేవల్లో శ్రీ మలయప్ప స్వామి ఆయా వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఊరేగుతారు.

– తిరుమల



ఫల పుష్ప ప్రదర్శనశాల





ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన మహాభారత ఘట్టం, ఆకట్టుకుంటున్న దేవతామూర్తుల చిత్రాలు

న్యూస్‌రీల్

ఉద్యోగుల తుది జాబితా విడుదల

తిరుపతి తుడా : చిత్తూరు, తిరుపతి జిల్లాల ఆరోగ్య సంస్థల సంయుక్త నోటిఫికేషన్ తుది జాబితా మంగళవారం విడుదలైంది. వైద్య సంస్థల్లో పలు కేటగిరీల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రభు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్వీ మెడికల్ కళాశాలలో ఓటీ అసిస్టెంట్, అనస్తీషియా టెక్నీషియన్, మార్చురీ మెకానిక్, స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ల్యాబ్ అటెండెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, ప్రసూతి ఆసుపత్రిలో అటెండెంట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. తాత్కాలిక మెరిట్ జాబితాకు సంబంధించి ఏవైనా ఫిర్యాదుల ఉంటే ఈనెల 29వ తేదీలోపు సంబంధిత పత్రాలతో ప్రిన్సిపల్ కార్యాలయానికి స్వయంగా హాజరుకావాలని తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నారాయణమ్మ

తిరుపతి సిటీ : విద్యార్థినులు సమాజ సేవలో భాగం కావాలని ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఒక ఊరిని దత్తత తీసుకుని ఆ ఊరిలోని పరిసరాల పరిశుభ్రత, అక్షరాస్యత, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. దీంతో గ్రామాభివృద్ధి సులభతరం అవుతుందన్నారు. అనంతరం రోటరీ క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ వేమూరి జయరాం ప్రసాద్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నివారణకు విద్యార్థినులు సంకల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ దివ్యవాణి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు సీఎం చంద్రబాబు రాక

తిరుపతి అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం తిరుపతికి రానున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 5.35 గంటలకు తాజ్ హోటల్ నందు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని అనంతరం రోడ్డు మార్గాన 6.20 గంటలకు తిరుమల గాయత్రి అతిథి గృహానికి చేరుకుంటారని చెప్పారు. ఆ తర్వాత 7:40 గంటలకు బేడీ ఆంజనేయ స్వామి గుడి వద్దకు చేరుకుని ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుంటారని చెప్పారు. అనంతరం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకుంటారని వెల్లడించారు. ఆ తర్వాత గాయత్రి అతిథి గృహం చేరుకొని రాత్రి బస చేస్తారని, గురువారం ఉదయం 9.10 నుంచి 9.50 గంటల వరకు వెంకటాద్రి నిలయం ట్విన్ కమాండ్ సెంటర్ – ఇంటిలిజెంట్ క్రౌడ్ – సైబర్ కంట్రోల్, శ్రీవారి ప్రసాదాల ఇంగ్రెడియెంట్స్ – విజన్ బేస్డ్ సార్టింగ్ మెషిన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం 10.35 గంటలకు తిరుపతి (హోటల్ తాజ్ సమీప హెలిప్యాడ్) చేరుకుని, అమరావతికి బయలుదేరి వెళ్తారని వివరించారు. ఆ మేరకు భద్రతా ఏర్పాట్లు చేపట్టామని స్పష్టం చేశారు.

జగన్‌పై కక్ష..
చిన్నారులకు శిక్ష

ఇదీ అప్పటి సీఎం వైఎస్ జగన్ మాట

'రాష్ట్రంలో చిన్న పిల్లలు ఎవరూ ఖరీదైన వైద్యం అందక మృతి చెందకూడదు. తన బిడ్డను అనారోగ్యం నుంచి కాపాడుకోలేకపోయాను అన్న బాధ ఏ తల్లి పడకూడదు. భావితరాల యువతను ఆరోగ్యంగా అందించే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఖరీదైన వైద్యం ఉచితంగా అందించే బాధ్యత తీసుకుంటున్నాం. ఎంత ఖర్చైనా , ఎలాంటి వ్యాధి అయినా సరే పిల్లలను రక్షించుకోవడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాధ్యత. అనారోగ్య సమస్యతో ఏ ఒక్కరూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో చిన్నపిల్లల కోసం శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. రెండేళ్లలో ఈ ఆసుపత్రి ప్రారంభించుకొని పిల్లలకు పునర్జన్మను ప్రసాదించే దేవాలయంగా కొనసాగుతుంది' అని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్ఘాటించారు.

చిన్నపిల్లల ఆసుపత్రికి గ్రహణం

- మల్టీ సూపర్ స్పెషాలిటీపై చిన్నచూపు
- నిధులు విడుదల చేయకుండా వేధింపులు
- వైఎస్ జగన్ మానసపుత్రిక అని ఆసుపత్రిపై అక్కసు
- నెలల తరబడి సాగదీస్తున్న భవన నిర్మాణ పనులు
- 2024 జూలైలో ప్రారంభించాలని సంకల్పించిన నాటి ప్రభుత్వం
- పనులు పూర్తి చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న టీటీడీ

తిరుపతి తుడా : తీవ్రమైన అనారోగ్య సమస్యల నుంచి చిన్నపిల్లలను కాపాడి ఆరోగ్యవంతమైన భావితరాన్ని ఆవిష్కరించేందుకు తిరుపతి లో శ్రీవారి పాదాల చెంత అలిపిరి సమీపంలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థాపించాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించారు. రాష్ట్రంలో చిన్న పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించే ఆసుపత్రి ఇప్పటి వరకు లేదు. ఆ లోటును అధిగమిస్తూ మొత్తం 15 రకాల ప్రత్యేక విభాగాల సామర్థ్యంతో అత్యాధునిక వైద్య సేవలను అందించాలని భావించారు. ఈ ఆసుపత్రి తన మానస పుత్రికగా ప్రకటిస్తూ 2022 మే 5వ తేదీన శ్రీవారి పాదాల చెంత అలిపిరి సమీపంలో భూమి పూజ చేశారు. రెండేళ్ల లో భవన నిర్మాణాలు పనులు పూర్తి చేసుకుని, వైద్య పరికరాలు కొనుగోలు, సిబ్బంది నియామకం ప్రక్రియ పూర్తి కావాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఇందుకు తగ్గట్టే 2024 జూలైలో ఆసుపత్రిని ప్రారంభించేలా టీటీడీ సైతం యుద్ధ ప్రాతిపదికన పనులను దాదాపుగా పూర్తి చేసింది.

కార్డియాక్ సెంటర్‌తోనే ప్రేరణ

అభం శుభం తెలియని పసిపిల్లలు గుండె సమస్యతో బాధపడుతూ మృత్యువాత పడుతున్న విషయాన్ని గుర్తించిన నాటి సీఎం వైఎస్ జగన్ తిరుపతిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల కార్డియాక్ కేర్ సెంటర్‌ను 2022లో ప్రారంభించారు. ఈ ఆసుపత్రి అనతి కాలంలోనే ప్రాచుర్యం పొందింది. వేల మందికి గుండె సంబంధిత సమస్యలను పరిష్కరించి పిల్లల పాలిట సంజీవినిగా మారింది. ఇప్పటి వరకు 20 మందికి గుండె మార్పిడి చికిత్సలను విజయవంతంగా అందించింది. పొరుగు రాష్ట్రాల నుంచి కాక బంగ్లాదేశ్ నుంచి సైతం వచ్చి ఇక్కడ గుండె సంబంధిత వైద్య సేవలను ఉచితంగా పొందారు. ఈ ఆసుపత్రి పురుడు పోసుకున్న అనతి కాలంలోనే సత్ఫలితాలు వచ్చాయి. ఇదే ప్రేరణతో చిన్న పిల్లలకు గుండె సంబంధిత వైద్యమే కాదు మొత్తం 15 రకాల ప్రత్యేక విభాగాలతో ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమని భావించారు. ఈ బాధ్యతను టీటీడీకి అప్పగించారు. చక చకా అనుమతులు పొంది 2022 మే 5వ తేదీన ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

15 విభాగాలతో ...

చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని 15 విభాగాలతో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలానే అవయవ మార్పిడి, ఇతర అత్యవసర వైద్య సేవల కోసం భవనంపై హెలీప్యాడ్‌ను నిర్మించాలని, ఆ దిశగా డిజైన్ చేశారు. ఈ ఆసుపత్రిలో చిన్నపిల్లల కార్డియాలజీ, న్యూరాలజీ ,న్యూరో సర్జరీ, పల్మనాలజీ, ఆర్థో, అంకాలజీ వంటి మొత్తం 15 ప్రత్యేక విభాగాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. అత్యాధునిక ఐసీయూ, ఆర్ఐసీయూ, 8 ఆపరేషన్ థియేటర్లు, ఎంఆర్ఐ, సిటీ యంత్రాలు, ఆధునిక ల్యాబ్ ఉండేలా ప్రణాళికలు చేశారు.



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తిరుపతిలో గుండె చికిత్సల కోసం ప్రారంభించిన చిన్నపిల్లల ఆసుపత్రి.. నేడు నిధులు లేక ఆగిపోయిన దృశ్యం

నిధులు మంజూరు కాకుండా అడ్డుపడి..

ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభించారు. అంతే వేగంగా పనులు చకచకా సాగిపోయాయి. అంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నిధులతో 2024 చివర వరకు పనులు కొనసాగాయి. టీటీడీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. టీటీడీలో నిర్మిస్తున్న పలు భవనాలను సందర్శించింది. ఈ క్రమంలో చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాన్ని సందర్శిస్తూ టీటీడీకి ఇంత భారం అవసరమా అంటూ పాలకవర్గంలోని ఓ ముఖ్యమైన వ్యక్తి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే కొంత మంది బోర్డు సభ్యులు కలగజేసుకొని చిన్న పిల్లల వైద్యం కోసం టీటీడీ ఖర్చు చేయడం ఏ మాత్రం తప్పు కాదని, పనులు పూర్తి చేయకపోతే చెడ్డపేరు వస్తుందని ఆ వ్యక్తికి సూచించారు. భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ సమయంలో ఆసుపత్రిని అర్ధాంతరంగా వదిలేస్తే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకత తప్పదని ఒకరిద్దరు బోర్డు సభ్యులు హెచ్చరించారు. ఆ ముఖ్యమైన వ్యక్తి అయిష్టంగానే అంగీకరించినా ఆపై తన వక్రబుద్ధిని ప్రదర్శించారు. ఆసుపత్రి నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయించారంటూ నిధులు మంజూరు కాకుండా అడ్డు పడ్డారు. గడిచిన ఏడెనిమిది నెలలుగా నిధులు మంజూరు చేయకుండా చక్రం తిప్పారు. దీంతో పనులను అర్ధాంతరంగా ఆగిపోయాయి.

ఆసుపత్రి పేరు : శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ
నిర్వహణ బాధ్యత : టీటీడీ
వైద్య సేవలు : పూర్తిగా ఉచితం
ఆసుపత్రి నిర్మాణ వ్యయం : రూ.320 కోట్లు
ఆస్పత్రి విస్తీర్ణం : 4 లక్షల 11 వేలా 325 చదరపు అడుగులు
అంతస్తులు : ఆరు
బెడ్ల సామర్థ్యం : 350
ఆసుపత్రిలో విభాగాలు : మొత్తం 15
ఆసుపత్రి ప్రత్యేకత : అత్యవసర వైద్య సేవలు కోసం భవనంపైనే హెలిప్యాడ్ నిర్మాణం

పాలక మండలిలో భిన్నాభిప్రాయాలు

ఈ ఆస్పత్రి పూర్తి చేసే విషయంలో టీటీడీ పాలక మండలి వేర్వేరు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గ అధిపతిగా ఉన్న వ్యక్తితో పాటు మరో నలుగురు ఆస్పత్రి పట్ల వ్యతిరేకతతో ఉన్నట్లు సమాచారం. కోట్లాది రూపాయల భారం టీటీడీ ఎందుకు భరించాలంటూ ఆ ఐదుగురు ఆసుపత్రిని వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే ఆసుపత్రి నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ బురదజల్లి ఆసుపత్రిని అడ్డుకుందామంటూ చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఎక్కువ మంది బోర్డు సభ్యులు వైద్యం కోసం టీటీడీ ఎంత ఖర్చు పెట్టినా తప్పేమీ లేదని, ముఖ్యంగా చిన్న పిల్లలకు సంబంధించిన ఆసుపత్రి కాబట్టి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పునః ప్రారంభించేలా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందంటూ కుండ బద్దలు కొడుతున్నారు. అయినా ఆ వ్యక్తి మనసు కరగకపోవడంపై బోర్డు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిని పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకత తప్పదని, దేవుడితో సమానమైన చిన్న పిల్లల విషయంలో మీనమేషాలు లెక్కించడం మంచిది కాదని జిల్లాకు చెందిన కొంతమంది టీటీడీ బోర్డు సభ్యులు తెగేసి చెప్పినా ఆ వ్యక్తి మాత్రం వినీ విననట్లు వదిలేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. చిన్నపిల్లల ఆసుపత్రి విషయంలో ఇంతలా పట్టుబట్టడం మంచిది కాదని టీటీడీ అధికారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే..

నాటి సీఎం వైఎస్ జగన్ తన మానస పుత్రికగా ప్రకటించి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పట్టాలెక్కించారు. రాష్ట్రంలో ఎక్కడైనా విధంగా ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే అక్కసుతోనే పనులను కొనసాగించకుండా నేటి ప్రభుత్వంలోని కూటమి నేతలు అడ్డుకట్ట వేశారు. ఆసుపత్రిని పూర్తి చేయకుండా కాకమ్మ కథలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. నిధులు మంజూరు చేయకుండా పనులను కొనసాగకుండా టీటీడీ బోర్డులోని ముఖ్యమైన వ్యక్తి అడుగడుగునా అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. ఏడాది క్రితమే ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉండగా మరో రెండేళ్ల పాటు సాగదీసి ఆపై నిర్ణయం తీసుకునేందుకు కుట్రలు పన్నుతున్నట్లు తెలుస్తోంది.

సమ్మెకు వైద్యులు సన్నద్ధం



కలెక్టర్‌కు సమ్మెకు చెందిన వినతిపత్రాన్ని అందిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు



డీఎంహెచ్‌వోకు సమ్మె వినతిపత్రాన్ని ఇస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

- 25న కార్యాచరణ ప్రకటిస్తాం
- కలెక్టర్‌కు, డీఎంహెచ్‌వోకు వినతి పత్రాన్ని ఇచ్చిన పీహెచ్‌సీ వైద్యులు

తిరుపతి అర్బన్ : ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా సమస్యలు పరిష్కారం కావడం లేదు.. సమ్మెకు వెళుతున్నాం అంటూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు తెలియజేశారు. మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. తమ పోరాటం ప్రజలపై కాదని...ప్రభుత్వ నిర్లక్ష్యంపై మాత్రమేనని వెల్లడించారు. ఈ అంశాన్ని ప్రజలు కచ్చితంగా గుర్తించాలని కోరారు. గురువారం సమ్మెకు సంబంధించి కార్యాచరణ ప్రకటించి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్‌కు సమ్మెకు సంబంధించిన వినతిపత్రాన్ని వైద్యులు అందించారు.

ప్రభుత్వ వైద్యుల ప్రధాన డిమాండ్లు ఇవే..

- పీహెచ్‌సీ వైద్యులకు కచ్చితమైన పనిగంటలు కేటాయింపు
- స్థిరమైన వారాంతపు సెలవు ఇవ్వడం
- డాక్టర్లకు జాబ్ చార్ట్ కేటాయింపు
- పీహెచ్‌సీలను అనధికారిక వ్యక్తుల తనిఖీలను తగ్గించడం
- తగ్గినంత మేరకు స్టాఫ్ నర్సుల కేటాయింపు
- ఇన్‌సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించడం
- టైమ్‌బౌండ్ ప్రమోషన్లు అమలు చేయడం
- గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బేసిక్ పే 50శాతం, ట్రైబల్ అలవెన్స్
- నోషనల్ ఇంక్రిమెంట్స్ మంజూరు
- చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్‌కు వైద్యులకు 5వేలు అలవెన్స్.

పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తులు

తిరుపతి కల్చరల్ : సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు సబంధించి ఉచిత వసతి, శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఐబీపీఎస్, ఆర్‌ఆర్‌బీ, సీజీఎల్ టియర్–11 వంటి పోటీ పరీక్షల టీయర్–11 మెయిన్ పరీక్షల కోసం ఉచిత వసతి సౌకర్యంతో కూడిన శిక్షణ 60 రోజులు ఉంటుందని తెలిపారు. ఎస్సీలకు 80 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 10 శాతం, ఓసీలకు 5 శాతం, పీడబ్ల్యూడీ వారికి 3 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు గ్రాడ్యుయేట్ డిగ్రీ కలిగి,టీర్–11 ప్రిలిమినరీ పరీక్ష రాసి ఉండడంతో పాటు ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు వార్షిక ఆదాయం రూ.6 లక్షలలోపు ఉన్న వారు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు నేటి నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్ అక్టోబర్ 12వ తేదీ నిర్వహించి 22వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రాంభించనున్నట్లు తెలిపారు. తిరుపతి, విశాఖపట్నం సెంటర్లలో శిక్షణ ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 86396 27455, 81422 24539 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

క్రమశిక్షణతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

- బ్రహ్మోత్సవాల సిబ్బందికి డీఐజీ, ఎస్పీ సూచన

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో వివిధ రాష్ట్రాల నుంచి తిరుమలకు వచ్చిన పోలీసు సిబ్బందికి అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. తిరుమల పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద మంగళవారం వారు సిబ్బందితో మాట్లాడుతూ తిరుమల ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఇక్కడ విధులు నిర్వహించడం దేవునికి సేవ చేయడమే అన్నారు. ఏదైనా సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్వహించేటప్పుడు ప్రతి ఒక్కరు యూనిఫామ్ తప్పని సరిగా ధరించాలన్నారు.

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత

శ్రీవారి సాలకట బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. అందులోభాగంగా గరుడోత్సవం రోజున 4 నుంచి 5 లక్షల మంది శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉంది. మిగతా రోజుల్లో రోజుకు సుమారు లక్షమంది దర్శించుకుంటారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు 3,782 మందితో పటిష్ట భద్రతా ఏర్పాటు చేపట్టినట్లు డీఐజీ, ఎస్పీ తెలిపారు. గరుడసేవ సందర్భంగా తిరుమలకు ద్విచక్ర వాహనాలను 27వ తేదీ మధ్యాహ్నం నుంచి అనుమతించేది లేదని చెప్పారు. తిరుమలలో 32 ప్రదేశాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటుచేసి 15 వేల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. తిరుపతిలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం అలిపిరి బస్టాండ్, పాత చెక్‌పాయింట్, ఇస్కాన్ మైదానం, మెడికల్ కళాశాల మైదానం, నెహ్రూ మున్సిపల్ మైదానంలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థ 10 పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశామన్నారు. చిన్నారులు. వృద్ధులకు జియో ట్యాగింగ్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం తిరుమలలోని నాలుగు మాడ వీధులను పరిశీలించారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.1,17,900
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.1,0,611

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,38,900
రిటైల్ వెండి గ్రాము	రూ.141.90

క్లుప్తంగా

రబీ సీజన్‌కు ఎరువులు సిద్ధం చేసుకోవాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : అక్టోబర్ 1 నుంచి రైతులకు అవసరం అయిన అన్నీ రకాల ఎరువులను ఉంచాలని కలెక్టర్ వెంకటేశ్వర్ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఎరువుల కొరతను అధిగమించడానికి మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో ప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో 2128 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 2050 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ ధనంజయరెడ్డి, ఏవో గాయత్రి, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి ప్రవన్‌కుమార్, డీసీఓ నాగవర్ధన పాల్గొన్నారు.

కల్వర్టులో పడి వ్యక్తి మృతి



మునిరాజ(ఫైల్)


చంద్రగిరి : ప్రమాదవశాత్తు కల్వర్టులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని రాయలపురం పంచాయతీ వెంకటంపేటకు చెందిన పొదిలి మునిరాజ(43), నాగాల చెరువు సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో కాపాలదారుడుగా ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ పొలం వద్దకు వెళ్తున్న క్రమంలో నాగాలచెరువు సమీపంలోని ఓ చెక్‌డ్యాంపై కూర్చుని మద్యం తాగాడు. ఈ క్రమంలో మునిరాజ ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో పడిపోయాడు. మంగళవారం చెక్ డ్యాంలో శవమై తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ కళాశాలకు తరలించారు.

నిధులు సక్రమంగా వినియోగం

సాక్షి టాస్క్‌ఫోర్స్: రుయాసుపత్రి విషయంపై రుయా నిర్దయ అనే అంశంపై పత్రికలలో వచ్చిన వార్తలు అవాస్తవమని రుయా అధికారుల ఒక ప్రటనలో తెలిపారు. రుయాకు ఇచ్చిన నిధులను సక్రమంగా వినియోగిస్తున్నామన్నారు. సకాలంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. అలాగే స్విమ్స్ ఆసుపత్రిపై పత్రికలలో స్విమ్స్ కాలకూటమి అనే శీర్షికన వచ్చిన వార్తలు సత్యదూరమని సిమ్స్ అధికారులు ఖండించారు.

బ్రహ్మోత్సవ సంబరాలు







తిరుచ్చిపై కొలువుదీరిన శ్రీవారి సర్వసేనాధిపతి విష్వక్సేనులు, విద్యుత్తు దీపాల వెలుగులతో విరాజిల్లుతున్న తెలుగుతల్లి సర్కిల్

పుట్టమన్ను తీసుకొస్తున్న చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులు, చెవిరెడ్డి లక్ష్మీ, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

- కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- పురవీధుల్లో విహరించిన శ్రీవారి సర్వ సేనాధిపతి విష్వక్సేనులు
- ఆకట్టుకుంటున్న దేవతా మూర్తుల విద్యుత్తు కటౌట్లు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 4.30 గంటలకు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుణ్యాహవచనం, మత్స్రగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి, సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులతో పాటు తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పలువురు గ్రామ పెద్దలు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

ఏర్పాట్లను పర్యవేక్షించిన విష్వక్సేనులు

శ్రీవారి సర్వసేనాధిపతి విష్వక్సేనుల వారు స్వామి వారికి జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను తిరుచ్చి వాహనంపై విహరిస్తూ పర్యవేక్షించారు. యాగశాలలో జరిగిన వైదిక క్రతువుకు ముందుగా విష్వక్సేనుల వారిని తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారు వాహనాలపై విహరించే అన్ని వీధుల్లో ఊరేగించారు.

భక్తులకు అన్నప్రసాదాలు

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. వాహనసేవల సమయంలో భక్తులకు అన్న ప్రసాదాలు, మజ్జిగ, పాలు, తాగునీరు అందించనున్నారు. ఉత్సవాల్లో ఏదైన అనారోగ్య సమస్యలు వచ్చినట్లయితే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వీలుగా ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

ఆకట్టుకునేలా అలంకరణలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి ఆలయం, పరిసర ప్రాంతాల్లో భక్తులను ఆకట్టుకునే విద్యుత్, పుష్పాలంకరణలు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో 9 రోజుల పాటు అలంకరణకు సంబంధించి మొత్తం 3 టన్నుల పుష్పాలను వినియోగించనున్నారు. ఇందులో సంప్రదాయ పుష్పాలతో పాటు పరిమళభరిత పత్రాలు ఉన్నాయి. వాహనసేవల్లో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించనున్నారు. గ్రామ శివార్లలో దేవతామూర్తుల విద్యుత్ కటౌట్లు భక్తులను ఆకర్షిస్తున్నాయి.

నేడు ధ్వజారోహణం

ఈనెల24వ తేదీ బుధవారం సాయంత్రం 6గంటలకు జరిగే ధ్వజారోహణంతో శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5.30 గంటల నుంచి 6 గంటల మధ్యన మీన లగ్నంలో ధ్వజా రోహణ ఘట్టాన్ని సంప్రదాయ బద్ధంగా నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామి వారు విహరించనున్నారు.

31వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు గడువు

తిరుపతి సిటీ: ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించి 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు వచ్చే నెల 31వరకు రూ. 200 అపరాధ రుసుముతో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల నుంచి దరఖాస్తు చేసుకుని అడ్మిషన్లు పొందాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఆరోపణలు నిరూపించగలరా?

వెంకటగిరి (సైదాపురం) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో టీటీడీలో దొంగతనం జరిగిందని బీజేపీ నేతలు చేసిన ఆరోపణలపై వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఓ ఛానల్ ఇంటర్వ్యూలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీటీడీలో డబ్బు దొంగతనమా... ఆభరణాల దొంగతనమా... విగ్రహాల దొంగతనమా అని వ్యాఖ్యానించారు. 2019, 2024 మధ్య కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని నిజంగా ఒక కేసు ఉంటే వారు దానిని ఎందుకు లేవనెత్తలేదని ప్రశ్నించారు. జనసేన అయిన, బీజేపీ అయిన చంద్రబాబు స్క్రిప్టు రాసి వారికి అందజేస్తారని ఆరోపించారు. వారికి నిజంగా వాస్తవాలు తెలియవని ఇదే జరుగుతోందని, నిజమైన కేసు లేదా సమస్య ఉంటే అనేక ఆరోపణలు చేసినప్పటికీ వారు ఒక్క విషయాన్ని అయినా నిరూపించగలరా అని ప్రశ్నించారు.

కక్షగట్టి..కడుపుకొట్టి..



సాగుకు పనికిరాకుండా జేసీబీతో తవ్వి ట్రాక్టర్‌లోకి మట్టి పోస్తున్న దృశ్యం

చిట్టమూరు : మండల కేంద్రం చిట్టమూరులో ఓ పేద రైతు వైస్సార్‌సీపీ సానుభూతిపరుడనే కక్షతో సాగు భూమిలో జేసీబీ పెట్టి సాగుకు అనుకూలంగా లేకుండా మట్టిని ట్రాక్టర్లతో తరలించి కూటమి నేతలు సొమ్ము చేసుకుంటున్నారని బాధితుడు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదేమని అడిగితే తనపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టిస్తామని బెదిరింపులకు దిగుతున్నారని వాపోయాడు. బాధితుడు మల్లికార్జున వివరాల మేరకు గ్రామ సమీపంలోని రొయ్యల వాగు వద్ద 0 .90 సెంట్ల భూమిని తన తండ్రి వారసత్వంగా వస్తున్న భూమిలో సుమారు 40 ఏళ్లుగా వరి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపాడు. అయితే తాను వైఎస్సార్ సీపీ కార్యకర్తననే కడుపు మంటతో మంగళవారం అధికార పార్టీ నేతలు జేసీబీతో ఆరు అడుగుల గుంటలు కొట్టి మట్టి తరలించారని వాపోయాడు. ఆ పొలం తప్ప తనకు సెంటు భూమి కూడా లేదని తాను భార్య, ముగ్గురు పిల్లలతో ఎలా బతకాలని బాధితుడు మల్లికార్జున్ కన్నీటి పర్యంతమయ్యాడు. జిల్లా అధికారులైన తన గోడు విని న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల విడుదల వాయిదా

తిరుమల : పరిపాలనా కారణాల వల్ల డిసెంబర్ 29, 30, 31 (వైకుంఠ ద్వార దర్శనం) తేదీలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి బ్రేక్ దర్శనాలకు సంబంధించిన టిక్కెట్లు విడుదల చేయరని టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ టిక్కెట్ల విడుదలకు సంబంధించిన సవరించిన షెడ్యూల్‌ను త్వరలో విడిగా ప్రకటిస్తారని టీటీడీ పేర్కొంది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరుతోంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం



సంఘటనా స్థలంలో మృతి చెందిన వృద్ధుడు రాము

నాయుడుపేటటౌన్:పట్టణ పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీ సమీపంలో రహదారిపై మంగళవారం రాత్రి ఐస్ బండి నడుపుకునే వృద్ధుడి మోటార్ సైకిల్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ఉన్న రాము(60) సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రాంతానికి చెందిన కొంత మంది కొన్నేళ్లుగా పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో నివాసం ఉంటూ ఐస్ బండితో మోటార్ సైకిల్‌పై గ్రామాల్లో తిరిగి విక్రయాలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో రాము అనే వృద్ధుడు పను లు పూర్తి చేసుకుని మంగళవారం రాత్రి కాలనీకు వెళుతుండగా రహదారిపై వెనుక నుంచి వస్తున్న ఆటో వేగంగా వచ్చి ఐస్ బండితో పాటు మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృత్యువాత పడ్డా డు.

ఎర్ర చందనం కేసులో ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ఎర్ర చందనం చెట్లను నరకడానికి ప్రయత్నించిన కేసులో తమిళనాడు, ధర్మపురి జిల్లా, పాపిరెడ్డి పట్టి తాలూకా, కుందం పట్టి గ్రామానికి చెందిన అండీకి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, ఆరు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్ర చందనం కేసుల విచారణ సెషన్స్ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2017 ఆగస్టు 26వ తేదీ తిరుపతి టాస్క్ ఫోర్స్ ఫారెస్ట్ సిబ్బంది తిరుపతి, చామల రేంజ్, నాగపట్ల సెక్షన్, నాగపట్ల, బొబ్బల బావి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఆ సమయంలో కొంత మంది అటవీ ప్రాంతంలో గుంపుగా ఉండడాన్ని ఫారెస్ట్ సిబ్బంది గుర్తించారు. వారిని లొంగిపోవాలని ఫారెస్ట్ సిబ్బంది ఆదేశించారు. అయితే వారు రాళ్లతో ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేశారు. దాడిలో సుబ్బారెడ్డి అనే కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన వారు పరారయ్యారు. అయితే వారిలో నిందితుడు అండీ పారిపోతూ జారీ కిందపడ్డాడు. దీంతో అతడికి గాయాలయ్యాయి. ఫారెస్ట్ సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతడిపై రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు అండీకి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రసూతి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులతో బాధితురాలు

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల ప్రసూతి ఆసుపత్రి నందు డాక్టర్ ప్రమీలాదేవి, డాక్టర్ మాధవి బృందం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లికి చెందిన నాగమణి (35) సంతాన లేమి చికిత్స పొందిన 14 ఏళ్ల తరువాత గర్భం దాల్చిందని, ఆమె కొంత కాలంగా గల్ఫ్ దేశంలో నివసిస్తున్నారన్నారు. గర్భధారణ పరీక్షలు అన్ని విదేశాల్లో చేయించుకున్న ఆమె ప్రసవం కోసం తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి నందు చేరారని తెలిపారు. నిండు గర్భిణి అయిన ఆమెకు అండాశయంలో మ్యూసినస్ సిస్టడినోమా అని కణితి , హైపోథైరాయిడ్, కామెర్లు ఉన్నట్లు గుర్తించామని వైద్యులు తెలిపారు. ఆమెకు అన్ని రకాలైన పరీక్షలు చేసిన తర్వాత డాక్టర్ మాధవి, ప్రొఫెసర్, వైద్యబృందంతో కలిసి సిజేరియన్ ఆపరేషన్ ద్వారా 3 కేజీల బరువున్న ఆరోగ్యకరమైన ఆడ శిశువుకు ప్రాణం పోశారు. తొలగించిన కణితిని పరీక్షల కోసం ఎస్వీ వైద్య కళాశాల, పాథాలజీ విభాగానికి పంపించినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని చెప్పారు. ఈ ఆపరేషన్ హెచ్.ఓ.డి , సూపరింటెండెంట్ డాక్టర్. ప్రమీళా దేవి పర్యవేక్షణలో జరిగిందని తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్యా సంచాలకులు , ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవి ప్రభు, అరుదైన శస్త్ర చికిత్స చేసిన బృందాన్ని అభినందించారు.

లభ్యంకాని గల్లంతైన యువకుడి ఆచూకీ

కలువాయి (సైదాపురం):కలువాయి మండలంలోని కేశమనేనిపల్లి గ్రామానికి చెందిన చలకచర్ల శ్రీను (28) కాలువలోకి దిగి ప్రమాదవశాత్తు జారి పడి గల్లంతయ్యాడు. మంగళవారం తెలుగు గంగ కాలువ వెంట గ్రామ రెవెన్యూ అధికారి హజరయ్య, గ్రామస్తులు, బంధువులు కలిసి తిరిగినా ఆచూకీ లభ్యం కాలేదు. గల్లంతైన శీనయ్య ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

1,529 మందికి డీఎస్సీ నియామక పత్రాలు

- నేడు 7 గంటలకు రిపోర్టు చేసుకోవాలి
- విలేకరులతో డీఈవో వరలక్ష్మి



మాట్లాడుతున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీలో ఎంపికైన 1,529 మంది అభ్యర్థులకు విజయవాడలో నియామకపత్రాలు అందజేయనున్నట్టు డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను విజయవాడకు తీసుకెళ్లే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంపికై న అభ్యర్థులందరూ బుధవారం ఉదయం 7 గంటలకు తిరుపతి జిల్లా కేంద్రంలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకోవాలని సూచించామన్నారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 84 బస్సుల్లో అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులను విజయవాడకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఇతర యాజమాన్యాల్లో ఎంపికై న 1,408 మంది అభ్యర్థులతో పాటు జోనల్ పోస్టుల్లో మోడల్ స్కూళ్లకు ఎంపికై 121 మందికి ఈ నెల 25వ తేదీన నియామకపత్రాలు అందుకోనున్నట్టు తెలిపారు. లైజన్ ఆఫీసర్‌లుగా నలుగురు డీవైఈవోలు వ్యవహరిస్తారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేసే ఉత్తర్వుల ఆధారంగా ఎంపికై న అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్టు తెలిపారు.

అక్టోబర్ 2 వరకు ‘స్వచ్ఛతాహి సేవా’



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : ఈనెల 17న మొదలైన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను అక్టోబర్ 2 వరకు కొనసాగించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థులు ప్రతిరోజు చేతులు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. అలాగే గ్రామ, మండల స్థాయిలో పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అన్ని ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పెద్ద మొత్తంలో పేరుకుపోయిన వ్యర్థాల స్థలాలు గుర్తించి వాటిని ప్రజల సహకారంతో శుభ్రంగా చేయించాలని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవోలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నరేంద్రకుమార్, ఎంఐఎస్ మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టండి



సమీక్షిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్ : బాల్యవివాహాలపై కేసులు నమోదు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్‌లో అధికారులతో మిషన్ వాత్సల్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి–ఆగస్టు వరకు 25 బాల్య వివాహాలు నమోదు అయినట్లు చెప్పారు. సమాచారం అందించిన వెంటనే వివాహాలను అడ్డుకుని వారికి అవగాహన కల్పించామని వెల్లడించారు. వివాహాలు చేసుకునే వరకు వెళ్లకుండా ముందే వారికి పూర్తి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య ఉద్దేశం సమాజంలో నిరాధారణకు గురైన బాలలకు రక్షణ కల్పించి వారికి విద్య, ఆరోగ్యంతో పాటు ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యాన్ని అందించాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, మిషన్ కోఆర్డినేటర్ కృష్ణ మంజరి, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, జిల్లా ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లాలప్ప, బాలల సంక్షేమ సంఘం, చైర్‌పర్సన్ వసంత, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుకే రేషన్!

- 40,334 మందికి అందని కార్డులు
- ప్రభుత్వం నుంచి స్పష్టత రాని వైనం



స్మార్ట్ రేషన్‌కార్డు

తిరుపతి అర్బన్ : గత ప్రభుత్వంలో ఇచ్చిన రేషన్ కార్డులను రద్దు చేస్తూ... కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డుల పేరుతో పసుపు రంగుతో కూడిన కొత్త కార్డులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అయితే జిల్లాలో పాత రేషన్‌కార్డులు 5,87,001 ఉన్నాయి, అందులో 5,80,120 మందికి మాత్రమే ఆగస్టులో స్మార్ట్ కార్డులు ఇచ్చారు. మిగిలిన 6,881 మందికి స్మార్ట్ కార్డులు అందలేదు. మరోవైపు కొత్తకార్డులు 33,453 ఉన్నాయి.వాటి స్థానంలో స్మార్ట్ కార్డులు ఇవ్వాల్సి ఉంది. మొత్తంగా జిల్లాలో 40,334 మందికి స్మార్ట్‌కార్డులు అందలేదు. అయితే ఈనెల 15వ తేదీకి రెండో విడతలో భాగంగా 40,334 స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తామని సివిల్ సప్లయి అధికారులు ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు ఆ ఊసేలేదు. మొదటి విడతలో ఇచ్చిన స్మార్ట్ కార్డుల్లోనూ పలు తప్పులు నెలకొన్నాయి. వాటిని సవరించుకోవాల్సి ఉంది.

లబ్ధిదారుల ఆందోళన

అక్టోబర్ నెలలో చౌక దుకాణాల్లో ఇచ్చే సరుకులు పొందాలంటే స్మార్ట్ రేషన్ కార్డులు ఉండాలంటూ పలువురు డీలర్లు ముందే కార్డుదారులకు తెలియజేస్తున్నారు. దీంతో స్మార్టు కార్డులు లేని వారు ఆందోళన చెందుతున్నారు. తమ వద్ద పాత కార్డులు మాత్రమే ఉంటాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇవ్వకుండా నిలుపుదల చేస్తే....తాము ఏం పాపం చేశామంటూ కార్డుదారులు పలువురు వాపోతున్నారు. నిత్యావసర సరుకులు ఇవ్వకుంటే పేదల కుటుంబాలకు ఇబ్బందులు తప్పవంటూ పలువురు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వంలో రేషన్ కష్టాలు ఇలా...

- 369 ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో ఇంటింటికీ రేషన్ సరుకులు నిలుపుదల చేశారు. దాంతో కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ప్రతి నెలా 1 నుంచి 17 వరకు సరుకులు ఇచ్చేవారు..ప్రస్తుతం 1 నుంచి 15 వరకు కుదింపు
- 1457 చౌక దుకాణాలు జిల్లాలో ఉన్నాయి...అయితే వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి ఒత్తిడి చేయడంతో 274 షాపులకు డీలర్లు ఖాళీ అయ్యారు. వాటిని పక్క డీలర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వారి ద్వారా అరకొరగా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.
- ప్రతి డీలర్‌కు 10శాతం అదనంగా బియ్యం ఇవ్వాల్సి ఉంది...ఆన్‌లైన్ పద్ధతిలో వాటిని రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన కార్డుదారుడు వచ్చినా ఇవ్వాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వంలో వాటిని నిలుపుదల చేశారు. దీంతో ఓ దుకాణం పరిధిలో ఉన్న కార్డులు వారి దుకాణంలో మాత్రమే బియ్యం తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.
- తాజాగా స్మార్ట్ రేషన్ కార్డులు అందరికీ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. అయితే స్మార్ట్ కార్డులు ఉంటేనే బియ్యం ఇస్తామని చెప్పడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

త్వరలో రెండో విడత కార్డులు వస్తాయి



త్వరలో రెండో విడతలో భాగంగా స్మార్ట్ రేషన్‌కార్డులు వస్తాయి. ఎప్పుడు వస్తాయనే విషయాన్ని స్పష్టంగా చెప్పలేం. అక్టోబర్ 1 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు ఉంటేనే బియ్యం ఇవ్వాలనే నిబంధనలు అధికారికంగా మాకు ఇప్పటి వరకు అందలేదు. ఈ నెల 30 లోపు ఈ విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తుందని భావిస్తున్నాం. వచ్చిన తర్వాత తెలియజేస్తాం. – శేషాచలం రాజు, జిల్లా సివిల్ సప్లయి అధికారి

మరో 3 రోజులు ప్రయాణ కష్టాలు



బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు (ఫైల్)

తిరుపతి అర్బన్ : ముందే ఆర్టీసీ బస్సుల కొరత జిల్లాలో తీవ్రంగా ఉంది. దానికి తోడు స్త్రీశక్తి పథకానికి పల్లె వెలుగు బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులను కేటాయించినా సరిపోవడం లేదు. మరోవైపు బుధవారం నుంచి తిరుమల బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 2 వరకు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 27, 28, 29 మూడు రోజులు వంద విద్యుత్ బస్సులను తిరుపతి–తిరుమలకు నడపనున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 25న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు ఇవ్వాలంటూ విజయవాడకు కొత్త ఉపాధ్యాయులను రావాలని ఆదేశించారు. వారి కోసం తిరుపతి నుంచి 84 బస్సులను బుధవారం ఉదయం వెళ్లేలా కేటాయించారు. దీంతో 24, 25, 26 తేదీల్లో ప్రయాణికులకు ఆర్టీసీ బస్సుల కొరత తప్పేలా లేదు. 25వ తేదీ నియమాక పత్రాలు ఇచ్చినప్పటికీ మూడు రోజులు ఆర్టీసీ బస్సులు ఆ సేవలోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రయాణికులు ఆ తేదీల్లో ప్రయాణానికి అవస్థలు పడాల్సిన పరిస్థుతులు నెలకొన్నాయి.